క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కోసం శనివారం నగరంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆనంద్ రీజెన్సీ రోడ్, పార్క్ బ్యాక్ సైడ్, యాక్సిస్ బ్యాంక్ రోడ్డు, చిన్న గాంధీ బొమ్మ, రవీంద్ర భారతి స్కూల్ ఏరియా, భాష్యం స్కూల్ ఏరియా, రౌండ్ పార్కు నుంచి ఏవీ అప్పారావు రోడ్డు, ఎపెక్స్ హాస్పిటల్ రోడ్డు, నారాయణ కాలేజీ, ఎస్‌కేవీటీ కాలేజ్ రోడ్, సీసీసీ చానల్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రాయపరెడ్డి చిన్నాకు మాతృవియోగం


నాగమణి (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపరెడ్డి చిన్నా మాతృమూర్తి నాగమణి (80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నగరంలోని అద్దేపల్లి కాలనీలోని గల రాయపురెడ్డి చిన్నా ఇంటిలో కన్నుమూశారు. నాగమణి భర్త అప్పల నరసయ్య గతంలోనే మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కాగా, చిన్నా రెండో కుమారుడు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు నాగమణి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆమె భౌతిక కాయానికి ఇన్నీసుపేట కైలాసభూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు, జడ్జి మాధురి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార కార్యాలయంలో ప్యానల్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి పలు అంశాలను వారికి వివరించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిపై ఆరా తీశారు. కేసులను సత్వరం పరిష్కరించాలని, దీనికి సంబంధించి ఎటువంటి సమస్యలున్నా వెంటనే జిల్లా న్యాయసేవాధికారసంస్థకు తెలియజేయాలని సూచించారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ పిటీషన్లకై వేసిన అర్జీల వివరాలను తెలుసుకున్నారు.

చల్లబడిన వాతావరణంతో ఉపశమనం

కడియం: ఉక్కపోతలతో నెల రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు చల్లబడిన వాతావరణం ఉపశమనం కల్పించింది. మూడు రోజులోగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏదో ఒక సమయంలో వర్షం పడుతోంది. వరుణ దేవుడు కరుణించడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాత్రి పూట సైతం తీవ్ర ఉక్కపోతల కారణంగా ఇబ్బందులు పడ్డ పరిస్థితి నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ముఖ్యంగా మండలంలో విస్తరించి ఉన్న నర్సరీల్లో మొక్కలను వేసవితాపం నుంచి కాపాడుకునేందుకు రైతులు చాలా అవస్థలు పడ్డారు. అవిసె మొక్కలు, షేడ్‌నెట్ల సాయంతో మొక్కలను కాపాడుకునేందుకు సమాయత్తమయ్యారు. అయితే వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో వరి కోతలు నూరుశాతం పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పంట దెబ్బతినే పరిస్థితులు లేవని తెలిపారు.

మహిళల విజయం స్ఫూర్తిదాయకం

ప్రకాశం నగర్: మహిళలు కుటీర పరిశ్రమలతో పాటు పెద్ద వ్యాపారాల్లో కూడా రాణించాలని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శ్రీకర్ కందా, అలేఖ్య అన్నారు. వ్యాపార రంగంలో విజయ పథకంలో దూసుకు పోయిన 20 మంది మహిళల జీవితాలపై ఇంగ్లిషులో రూపొందించిన ఫియర్లెస్ ఫెమ్ ప్రెన్యూర్స్ పుస్తకాన్ని శుక్రవారం సాయంత్రం హోటల్ లా హాస్పిన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల విజయాలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. రచయితలు ఎస్.కృష్ణ సౌజన్య, చారిమ్లా సంజీవ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇలాంటి పుస్తకాలను అందించడం ద్వారా వారి విజయాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. రాజమహేంద్రవరం, విశాఖ తదితర ప్రాంతాల్లో పచ్చళ్లు, పూరీలు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫుడ్ ఐటమ్స్, హెల్త్ కేర్, ఫిట్ నెస్, జ్యుయలరీ, కేక్స్ తదితర విభాగాల్లో మహిళలు రాణిస్తూ, తమతో పాటు మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు.


ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు


శిక్షణకు హాజరైన విద్యార్థులు

సెలవుల్లో సరదాగా..

- ఉల్లాసంగా వేసవి క్రీడా శిక్షణ తరగతులు
- ఆసక్తిగా పాల్గొంటున్న చిన్నారులు
- సిటీ, రూరల్ పరిధిలో 50 కేంద్రాల ఏర్పాటు

ప్రకాశం నగర్: ఏడాది పొడవునా చదువులతో కుస్తీ పట్టే విద్యార్థులకు వేసవి సెలవులు ఉత్సాహాన్నిస్తాయి. ఆటపాటలతో గడిపే అవకాశం కల్పిస్తాయి. ప్రస్తుతం పిల్లలకు బడి రోజుల్లో ఆడుకోవడానికి సమయం ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ విషయంలో వెసులుబాటు ఉన్నా, కొన్ని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రం ఆడుకోవడానికి సమయం ఉండదు. ఉదయం పాఠశాలలకు వెళితే, స్పెషల్ క్లాసుల తర్వాత రాత్రికి ఇంటి చేరుకుంటున్నారు. నగర జీవితంలో ఆడుకోవడానికి చోటు కూడా దొరకపోవడం మరో కారణం అని చెప్పవచ్చు.

ప్రభుత్వం చర్యలు

సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వారికి నచ్చిన క్రీడలో శిక్షణ పొందే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే ఒకటిన ప్రారంభించింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా అర్బన్ , రూరల్ నియోజకవర్గాల పరిధిలో 50 కేంద్రాలలో శిక్షణ ఇస్తున్నారు. వీటిలో 14 ఏళ్ల లోపు బాల బాలికలు తమకు నచ్చిన క్రీడలో మెళకువలు నేర్చుకుంటున్నారు. ఒక్కో సెంటర్‌లో 20 మంది బాలురు, 25 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు.

ఈ నెల 31 వరకూ నిర్వహణ

నగరంలోని ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, డీఎంహెచ్ స్కూల్ క్రీడా ప్రాంగణం, స్టేడియం, నన్నయ పాఠశాల క్రీడా మైదానాల్లో విద్యార్థులకు ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, బాక్సింగ్, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్‌తో పాటు ఖోఖో, హాకీ, టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయి. ఈనెల 31వ తేదీ వరకూ శిక్షణ శిబిరాలు కొనసాగుతాయని జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా..

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఇప్పటికే జగనన్న క్రీడా సంబరాలతో పాటు ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడా పోటీలను అధికారులు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. క్రీడాకారులకు ఆయా క్రీడలకు అవసరమైన సామగ్రిని అందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరిగినప్పుడు ప్రభుత్వమే క్రీడాకారులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తోంది. దీనిపై క్రీడా విశ్లేషకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

> **మానసిక ఉల్లాసం**
>
> క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. వేసవి సెలవులలో సమయం వృథా కాకుండా విద్యార్థులు తమకు నచ్చిన ఆటలో మెళకువలు నేర్చుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరించేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయి. భవిష్యత్తులో క్రీడల్లో రాణించేందుకు వీలు కలుగుతుంది.
>
> – ఏవీడీ ప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

కంబాలచెరువు: సోషియల్ ఇన్క్యుబేషన్‌లో భాగంగా సెంట్రల్ జైలులో ఖైదీల మానసిక పరివర్తనపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సైక్రియాటిస్టులు డాక్టర్ రామరెడ్డి, డాక్టర్ నీలిమ మాట్లాడుతూ తెలిసీ, తెలియక మత్తు పదార్థాలకు బానిసలై, నేరాలకు పాల్పడి కారాగారానికి వస్తున్నారన్నారు. ఆ వ్యసనాలు మానుకొని పరివర్తన చెంది, సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఏదైనా పని చేసేటప్పుడు మంచి చెడులను తోటివారితో చర్చించి, మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డాక్టర్ పీతాని కోమలి, డాక్టర్ హారిక, కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్, జైలర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారుజామునే అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీతానగరం మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ రాజు

సీతానగరం: స్థానిక లమండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సత్యం మదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భగా పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాలు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన స్తంభాలకు తీగలు అమర్చలేదని, అలాగే హౌసింగ్ పెండింగ్ బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ ఎ.రామారావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా హౌసింగ్ బిల్లులు అవ్వలేదని, అనంతరం యథాతథంగా బిల్లులు మంజూరవుతాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగశేషవేణి మాట్లాడుతూ పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మి, వివిధశాఖాధికారులు, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, సంగన పోశయ్య, ఎంపీటీసీలు వెన్నెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీమహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు

- 2700 లక్ష్మీ గవ్వలతో అమ్మవారికి మహార్చన
- భక్తులకు గవ్వల ప్రసాదం
- పోస్టర్ ఆవిష్కరించిన చిన్న వెంకన్నబాబు స్వామీజీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని శ్రీమహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు శ్రీమహాలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు స్వామీజీ అన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను దానవాయిపేట ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ సమీపంలో ట్రస్ట్ జాతీయ గౌరవ సలహాదారులు సర్దార్ వెంకట్ రాజు నివాసంలో శుక్రవారం సమావేశంలో ఆవిష్కరించారు. వెంకన్నబాబు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కుంకుమార్చన, సాయంత్రం నవగ్రహ దీపం ప్రారంభం, దీపోత్సవం, సోమవారం లక్ష్మీనారీకేళ అర్చన, 21న గోమతి చక్రాలతో మహార్చన, మహాపుష్పార్చన, 22న మహా సుదర్శన హోమం, సాయంత్రం కల్యాణోత్సవం, 23 ఉదయం 6.30 నుంచి విశేష అభిషేకం, 105వ పుట్టింటి పట్టు వస్త్రాలంకరణ సేవ, తోమాలసేవ, 2,700 లక్ష్మీ గవ్వలతో మహార్చన, అన్నప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులు ముందుగా గోత్ర నామాలతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు, మనగుడి - మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి జాతీయ చైర్మన్ దుర్గా వెంకట హేమవతి, గౌరవ సలహాదారు సర్దార్ సుమేధ రాజు, మహిళా గౌరవ సలహాదారు గుబ్బల గంగా భవాని, ముదునూరి వెంకటలక్ష్మి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ శనివారపు ధనరాజు, అర్చక స్వామి దత్త నృసింహ రాజు పాల్గొన్నారు.

పంటలకు మేలు చేసిన వర్షం


నల్లమిల్లిలో రైతులు సాగు చేస్తున్న వంగ తోట

రంగంపేట: అడపాదడపా మే నెలలో కురుస్తున్న వర్షాల కారణంగా మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలం పదునెక్కింది. ఇప్పటికే మండలంలో నూరుశాతం వరి కోతల పూర్తి అవ్వడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. మరోవైపు కూరగాయల సాగు చేస్తున్న రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లోని రైతులను వేసవిలో సాగు నీటి ఇబ్బందులు నుంచి గట్టెక్కించడానికి ఇటీవల కురుస్తున్న వర్షాలు ఎంతో మేలు చేస్తున్నాయి. దీంతో వంగ, బెండ, బీర, దొండ, గోరు చిక్కుడు, మిరప తదితర కూరగాయ పంటలతో పాటు, తోటకూర, గోంగూర, కొత్తిమీర తదితర ఆకు కూరలకు సరిపడా పదును లభ్యమైందని రైతులంటున్నారు. ప్రస్తుతం ఈ పంటలన్నీ కళకళలాడుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

రాజానగరం: సమస్యల పరిష్కారానికి పోరాటమే సరైన మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా రంగంలో వచ్చిన మార్పులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఎం.రఘునాథరెడ్డి, కె.కోటేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్‌తో ఆరోగ్యకర జీవితం


పందలపాకలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

బిక్కవోలు: ఆరోగ్యకర జీవితానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పందలపాక-2 హెల్త్ క్లినిక్ వద్ద రక్తపోటు దినం సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి, రోగులను పరీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తపోటు వంశపారంపర్యంగా, ధూమపానం, ఊబకాయం, మద్యపానం, శారీరకశ్రమ లేకపోవటం, మానసిక ఒత్తిడి, మరికొన్ని రకాల వ్యాధుల కారణంగా వస్తుందన్నారు. రక్తపోటు పెరిగితే గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వ్యాధులు, దృష్టి లోపం, మెదడులో రక్తస్రావం వంటి ఇబ్బందులు ఉంటాయన్నారు. అందువల్ల ప్రతినెలా రక్తపోటు పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు రక్త పోటు పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలోని ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికీ తన భార్య కనిపించలేదని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సూరంపూడి ధన శంకర్ శుక్రవారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విశాఖ జిల్లా పాడేరు మండలం చాదుకట్ల గ్రామానికి కొర్ర పావనిని ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేదీన ధన శంకర్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ధన శంకర్ పనికి బయటకు వెళ్లాడు. తిరిగి 4.15 సమయంలో వచ్చేసరికి భార్య పావని ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల, ఆమె తల్లిదండ్రుల ఇంటి వద్ద వెతికినప్పటికీ పావని ఆచూకీ లభించలేదని ధన శంకర్ పోలీసులకు తెలిపాడు. ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జపమాల ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఆర్‌సీఎం చర్చిల్లో శుక్రవారం జపమాల ప్రార్థనలు నిర్వహించారు. కోరుకొండ ఎస్సార్ నగర్, బూరుగుపూడి చర్చిల్లో మే ఒకటో తేదీ నుంచి ఈ ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ మాసాన్ని ఏసుక్రీస్తు తల్లి మరియమ్మ నెలగా భావిస్తారు. దానిలో భాగంగా మహిళలు ఉపవాసాలతో ప్రార్థనలు చేస్తారు.

254 మందికి వైద్యసేవలు

సీతానగరం: చీపురుపల్లి ఎంపీయూపీ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 254 మందికి వైద్యసేవలు అందించారు. కీళ్లవ్యాధి నిపుణులు డాక్టర్ రవీంద్రబాబు, స్త్రీల వ్యాధుల నిపుణులు డాక్టర్ స్నేహ, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏబీకే చైతన్య, డాక్టర్ ఎన్.రాజు, కంటి నిపుణులు టి.సాంబదాసు వైద్యసేవలు అందించారు. 241 మందికి రక్తం, బీపీ పరీక్షలు, పరీక్షలు, ఐదుగురికి ఈసీజీ, 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి కళ్లజోళ్ల కోసం సిఫారసు చేశారు.

మట్టి గుణమే రైతన్న వరం

- భూసార పరీక్షలతో పంటలకు మేలు
- నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- మంచి దిగుబడి సాధించే అవకాశం



దోమాడలో మట్టి నమూనా సేకరిస్తున్న ఏఓ మణిదీప్ (ఫైల్)

పెదపూడి: సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. దీంతో సిఫారసు చేసిన ఎరువులు వాడవచ్చు. తద్వారా అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. భూమి సేద్యానికి అనువుగా లేని పక్షంలో, ఏలా బాగు చేసుకోవాలి, ప్రత్యామ్నాయంగా ఏం రసాయనాలు ఎలా వాడాలో తెలుస్తుంది.

రెండు నియోజకవర్గాల్లో 57 వేల ఎకరాలు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాలు, రాజానగరంలో 8,060 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు.

మట్టి నమూనాలు తీయడం

పంటలకు ఆరు అంగుళాలు లేక 15 సెం.మీ. లోతులో వీ (ఇంగ్లిష్ అక్షరం) ఆకారంలో గొయ్యి తీయాలి. పండ్ల తోటలకు 5 అడుగుల గొయ్యి తవ్వి, అడుగుకు ఒకటి చొప్పున 5 నమూనాలు తీయాలి.

నీటి నమూనా సేకరణ

బోరు వదిలిన అరగంట తరువాత నీటి నమూనా సేకరించాలి. బావి నుంచి సేకరిస్తే, మధ్య నుంచి నీరు సేకరించాలి. నీటి నమూనా సేకరించిన 24 గంటల్లోగా పరీక్షా కేంద్రానికి చేర్చాలి.

ఏలా అర్థం చేసుకోవాలి

మట్టి నమూనాలను పరీక్షించి పంటలను వేయాల్సిన ఎరువుల మోతాదు, ఇతర సూచనలను భూసార పరీక్షా కేంద్రానికి ఒక కార్డు ద్వారా రైతులకు తెలియజేస్తారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రంలో ఆరు రకాల పరీక్షలు చేస్తారు.

నేల స్వభావం

భూసార పరీక్షల్లో నేల స్వభావం అంటే తేలిక నేల, మధ్యరకం లేదా బరువు నేలగా గుర్తించి తెలియజేస్తారు. తేలికనేల అంటే రైతు పొలం ఎక్కువ ఇసుకతో కూడుకుని, చాలా తక్కువ బంక మట్టి కలిగి ఉంటుంది. బరువు నేల అంటే తక్కువ ఇసుక కలిగి, ఎక్కువ బంకమట్టి కలిగి ఉంటుంది. మధ్యస్థ నేలలో ఇసుక, బంకమట్టి ఇంచుమించు సమాన పాళ్లలో ఉంటాయి.

లవణాల సాంద్రత

రైతుల పొలాల్లో సోడియం, కాల్షియం, మెగ్నీషియం మొదలైన నీటిలో కరిగే పలు రకాల లవణాలుంటాయి. వీటి సాంద్రత ఎంత మోతాదులో ఉందో భూసార పరీక్షల ద్వారా తెలుసుకుని, వాటి విలువలను పొందుపరుస్తారు. నీటిలో కరిగి ఉన్న లవణాల సాంద్రత, సామాన్యంగా ఉందా, మొలకెత్తటానికి వీల్లేకుండా ఉందా లేదా పంటలకు హానికరంగా ఉందా అనే విషయాలు తెలుసుకోవచ్చు.

ఆమ్ల, క్షార లక్షణం

దీనినే ఉదజని సూచిక అంటారు. ఈ పరీక్ష ద్వారా రైతు పొలం ఆమ్లం, తటస్థం లేదా చౌడు గుణాల్లో దేనికి సంబంధించినదో తెలియజేస్తారు.

సేంద్రియ కర్బనం

ఈ పరీక్ష ద్వారా నేల ఉత్పాదకశక్తి సేంద్రియ పదార్థ మోతాదు ఎంత ఉందో తెలుస్తుంది. కార్డులో సేంద్రియ కర్బనం తక్కువ లేదా మధ్యస్థ లేదా ఎక్కువ ఉన్నది తెలుస్తుంది. తక్కువ, మధ్యస్థంగా ఉంది అని తేలితే కంపోస్టు ఎరువు ఏ మోతాదు వేయాలో ఫలితాల్లో తెలియజేస్తారు.

లభ్య భాస్వరం

నేలలో ఎంత మోతాదులో భాస్వరం పోషక పదార్థం ఉంది. పరీక్ష ద్వారా తెలుసుకొని తక్కువా, మధ్యస్థమా లేక ఎక్కువా అనేది ఫలితాల్లో తెలుపుతారు.

లభ్య పొటాష్

నేలలో ఎంత మోతాదులో పొటాష్ పోషక పదార్థం ఉంది తెలుసుకుని, తక్కువా, మధ్యస్థమా లేక ఎక్కువా అనేది ఫలితాల్లో తెలియజేస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొలంలో పంట ఉన్నప్పుడు మొక్కల వరుసల మధ్య తీయాలి.
- అతి సారవంతమైన చోట్ల నుంచి కానీ, అతి నిస్సారమైన చోట్ల నుంచి కానీ మట్టి తీసి, ఒకే నమూనాగా కలపరాదు.
- రసాయనిక ఎరువులు వేయగానే మట్టి నమూనాలు తీయరాదు.
- గట్ల పక్కన, చెట్ల కింద, చిత్తడి నేలల్లో, బండ్ల బాటల దారిలో, మెరక పల్లాల్లో, పెంట పోగులు వేసిన చోట్ల మట్టి నమూనాలు తీయరాదు.
- మట్టి నమూనాలు నింపు సంచులు రసాయన ఎరువులతో సంబంధం లేనివి ఉండాలి.
- మట్టి నమూనాలు బూడిద, చీకుడు ఎరువులతో సంబంధం ఉండేలా ఉంచరాదు.

భూసార పరీక్షతో లాభాలు

- భూసార పరీక్షతో సమతుల్య పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చు.
- ఎరువులను సమర్థవంతంగాను, పొదుపుగాను వినియోగించవచ్చు.
- భూసారాన్ని కాపాడవచ్చు.

సినిమాలు

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
సూర్యప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ	ది గ్యారీఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి	దర్శిని, రత్నం
నామవరం	
వీఎస్ మహల్	కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అపరిచితుడు, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కడియం	
వెంకటసూర్య	ఆ ఒక్కటీ అడక్కు